# పిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

**- నర్సంపేట ఏసిపి కిరణ్**





చెన్నారావుపేట, అక్టోబర్ 15,(జర్నలిస్ట్ వార్త): అనేక రకాల సమస్యతో పోలీస్ స్టేషన్ ఆశ్రయించే ఫిర్యాదు దారుల పట్ల పోలీసులు మర్యాదగా ప్రవర్తించాలని నర్సంపేట ఏసీపీ కిరణ్ అన్నారు. మంగళవారంచెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో ఏసిపి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సందర్శించిన ఏసీపీకి చెన్నారావుపేట పోలీస్ సిబ్బంది గౌరవ వందనం చేశారు. అనంతరం ఏసిపి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి రకరకాల సమస్యలతో ఫిర్యాదు చేయడానికి బాధితులు పోలీస్ స్టేషన్ వస్తుంటారు. సమస్యలతో సతమతమవుతూ వచ్చిన వారికి సమస్యను పరిష్కరించే విధంగా వ్యవహరించడంతో పాటు మర్యాదగా వ్యవహరించడం పోలీసుల బాధ్యతని సూచించారు. ప్రతీ ఫిర్యాదు స్వీకరించి, దర్యాప్తు చేయాలన్నారు. అనంతరం కచ్చితంగా న్యాయం వైపే కృషి చేయాలని చెప్పుకొచ్చారు. ఈ తనిఖీల్లో నెక్కొండ సిఐ చంద్రమోహన్, ఎస్ఐ రాజేష్ రెడ్డి, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

**- జాఫర్ గడ్ ఎస్సై రామ్ చరణ్**



జఫర్ గడ్, అక్టోబర్ 15,(జర్నలిస్ట్ వార్త): ఆకేరువాగు ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తరలించాలని చూస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జాఫర్ గడ్ ఎస్సై రామ్ చరణ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిడుగు, కూనూరు, తదితర ఆకేరువాగు ప్రాంతాలలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా ఇసుక రవాణా చేసే దారులలో అడ్డుకట్టలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారుల సహాయంతో జేసిబి మిషనరీతో రవాణా చేయు దారులన్నింటిని మూసి వేశారు. ఐనప్పటికీ కట్టలు తొలగించి, ఇసుక రవాణా చేయాలని చూస్తే వారికి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పది రోజుల క్రితం గాయాలతో బయటపడినా..

# బాలుడిని వెంటాడిన మృత్యువు

**తమ్ముడిని బస్సెక్కించి వస్తుండగా ఢీకొట్టిన కారు**



గరిడేపల్లి,అక్టోబర్ 15,(జర్నలిస్ట్ వార్త):
ఆ బాలుడిని మృత్యువు వెంటాడింది. పది రోజుల క్రితం స్వల్ప గాయాలతో బయటపడినా మంగళవారం కారు రూపంలో కబలించింది.

దసరా వేడుకల్లో తోటి స్నేహితులు, బంధువుల పిల్లలతో అప్పటివరకు సరదాగా ఆడుకున్నాడు. తమ్ముడితో కలిసి ఉత్సవాలలో ఆనందంగా గడిపాడు. సెలవులు ముగియడంతో తమ్ముడ్ని పాఠశాలకు పంపే క్రమంలో ప్రమాదంలో మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాయినిగూడెం గ్రామానికి చెందిన బెక్కం అశోక్, సుష్మలకు శ్రీరాం(11), సాయిరాం కుమారులు. ఇద్దరూ హుజూర్‌నగర్‌లోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. బస్సులో వెళ్లి వస్తుంటారు. దసరా సెలవులకు ముందు రోజు హుజూర్‌నగర్ నుంచి తండ్రితో ద్విచక్రవాహనంపై వస్తున్న శ్రీరాం పుస్తకాల బ్యాగు జారిపోతుందని పట్టుకోబోయి కింద పడిపోయాడు. అప్పుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

అనంతరం సెలవులు రావడంతో ఇంటి వద్దే ఉంటూ పండగ జరుపుకొన్నారు. గాయాలు పూర్తిగా తగ్గక పోవడంతో తాను బడికి వెళ్లలేక మంగళవారం ఉదయం తమ్ముడు సాయిరాంను పాఠశాలకు పంపించడానికి అమ్మమ్మ వెంకటలక్ష్మితో కలిసి స్కూల్ బస్సు దగ్గరకు వెళ్లాడు. బస్సు ఎక్కించి అందులోని తన స్నేహితులను పలకరించి వెనుతిరిగి వస్తున్నాడు. రోడ్డు దాటుతుండగా గరిడేపల్లి వైపు నుంచి హుజూర్‌నగర్ వెళ్తున్న కారు వేగంగా శ్రీరాంను ఢీకొట్టింది. దీంతో శ్రీరాం తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే హుజూర్‌నగర్‌కు అక్కడి నుంచి కోదాడకు, పరిస్థితి విషమించడంతో ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. తండ్రి అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చలిగంటి నరేష్ తెలిపారు.



# ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

చెన్నారావుపేట, అక్టోబర్ 15,(జర్నలిస్ట్ వార్త): చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ లో మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవ మర్చిపోలేనివన్నారు. ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అండెం కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం



రాయపర్తి, అక్టోబర్ 15,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం బురహన్ పల్లి గ్రామానికి చెందిన రమ్య ఎంబిబిఎస్ సీటు సాధించారు. ఫీజు కట్టలేని స్థితిలో ఉన్న రమ్య కుటుంబ పరిస్థితి తెలిసిన తెలంగాణ రాష్ట్ర ఎస్టిసెల్ ఉపాధ్యక్షులు రాథోడ్ సురేంద్ర నాయక్ మంగళవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. సమాచారం తెలుసుకున్న శ్రీనివాస్ రెడ్డి తక్షణమే స్పందించి, రమ్య కుటుంబ సభ్యులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఎంబిబిఎస్ సీటు సాధించిన రమ్యకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట మాజీ ఎంపీటీసీ సంధ్యా సోమయ్య, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు వల్లాల సుధాకర్, యూసఫ్, యాకూబ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ జ్వరంతో చికిత్స పొందుతున్న నరసింహ నాయక్

**- పరామర్శించిన బిఆర్ఎస్ జిల్లా నాయకులు సుధీర్ రెడ్డి**



రాయపర్తి, అక్టోబర్ 15,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మునావత్ నర్సింహా నాయక్ డెంగ్యూ జ్వరంతో హన్మకొండ రోహిణి హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. మంగళవారం సమాచారం తెలుసుకున్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి పట్ల వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు రెంటాల గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామి హుండీ ఆదాయం లెక్కింపు



ఐనవోలు, అక్టోబర్ 15,(జర్నలిస్ట్ వార్త): ఐనవోలు మల్లికార్జున స్వామి హుండీ ఆదాయం మంగళవారం లెక్కించారు. దేవాలయ కార్యనిర్వహణ అధికారి అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం దేవదాయ శాఖ వరంగల్ డివిజనల్ పరిశీలకులు అనిల్ కుమార్ పరిశీలనలో లెక్కించినట్లు తెలిపారు. తేదీ 16.07.2024 నుండి తేది 15.10.2024 వరకు మొత్తం 89 రోజులకు రోజులకు 4,62,444 రూపాయలు హుండీ ద్వారా వచ్చాయని తెలిపారు. వివిధ టికెట్స్ ద్వారా ఆదాయం 20,73,376 రూపాయలు వచ్చాయి. టికెట్స్, హుండీ ఆదాయం కలిపి మొత్తం 25,35,820 రూపాయల ఆదాయం వచ్చినట్లు వివరించారు. హుండీ ద్వారా వెలువడిన మిశ్రమ వెండి, బంగారం తిరిగి హుండీలోనే వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు పోలీస్ స్టేషన్, హెడ్ కానిస్టేబుల్ రాకేష్, యుగేందర్, రమేష్, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర సేవ సమితి సభ్యులు మహబూబాబాద్ వారు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మనస్థాపంతో ఉరివేసుకుని వ్యక్తి మృతి

మామునూర్, అక్టోబర్ 15,(జర్నలిస్ట్ వార్త): కిరోసిన్ డీలర్ గా పనిచేస్తూ జీవనం కొనసాగించిన సింగారపు కుమారస్వామి మనస్థాపంతో ఉరువేసుకుని మృతి చెందిన ఘటన మామునూర్ లో చోటు చేసుకుంది. మంగళవారం మమునూర్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం సింగారపు కుమారస్వామి గతంలో కిరోసిన్ డీలర్ గా పనిచేసేవారు. గత కొంతకాలం క్రితమే ప్రభుత్వం కిరోసిన్ పంపిణీ నిలిపివేసింది. జీవనాధారమైన కిరోసిన్ పంపిణీ నిలిపివేయడంతో మనస్థాపానికి లోనైన కుమారస్వామి అనారోగ్యం పాలైనారు. ఇలా కొంతకాలంగా అనారోగ్యం కారణంగా బాధపడుతూ ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి, కుమారస్వామి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారని, తన కుమారుడు సింగారపు మధు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై వివరించారు. తన తండ్రి మృతి పట్ల ఎవరిపై ఎలాంటి అనుమానాలు లేవని బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ గా దాసరి మధూష అనిల్ రెడ్డి ఎన్నిక



చెన్నారావుపేట, అక్టోబర్ 15,(జర్నలిస్ట్ వార్త): చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన దాసరి మధుష అనిల్ రెడ్డి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ గా ఎన్నికైనట్లు ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్, తెలంగాణ స్టేట్ చీఫ్ కో ఆర్డినేటర్ మడుపు రాంప్రకాష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రజల్లో ఉన్న ప్రతిభ వంతులను వెలికి తీసి, ఈ ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న సంస్థలో వారు ఎన్నికైనందుకు మధుష అనిల్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. వయస్సుతో సంబంధం లేకుండా, విభిన్న ప్రతిభవంతులైనవారు ఎవరైనా ఇంటర్నేషనల్ వండర్ బుక్ అఫ్ రికార్డ్స్ కోసం 9381021442 నెంబర్ సంప్రదించవలసిందిగా పేర్కొన్నారు.

## ఝాన్సీరెడ్డిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



రాయపర్తి, అక్టోబర్ 15,(జర్నలిస్ట్ వార్త): ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పరామర్శించారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మండల యూత్ అధ్యక్షులు ఎండి మహమూద్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అఫ్రోజ్ ఖాన్, మచ్చ నీలయ్య, ఎండి రఫీ, గారే బిక్షపతి, కోతి సుభద్ర వీరన్న, మల్యాల నరసింహమూర్తి, ఎండి గౌస్, చేగొండ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి భవన కార్మికుల ఆర్థిక సహాయం



కుందుర్పి, అక్టోబర్ 15,(జర్నలిస్ట్ వార్త): కుందుర్పి మండల కేంద్రంలో వెల్డింగ్ వర్కర్ కమ్మర క్రిష్ట మృతి చెందారు. మంగళవారం సమాచారం న్న కుందుర్పి స్థానికులు, భవన నిర్మాణ కార్మికులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ పరామర్శలో సర్పంచ్ మారుతీశ్వరి రామమూర్తి, బేల్దారి రామాంజనేయులు, బేల్దారి వెంకటేశులు, మరిస్వామి, లోకేష్, తలారి పెద్ద ఓబులేష్, భవన నిర్మాణ కార్మికుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

